www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023
5
ఏలూరు



'పది'లో జిల్లా మొదటిస్థానం సాధనకు కృషి : డిఇఒ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచి పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని డిఇఒ పులవర్తి శ్యామ్‌సుందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థి మానసిక ఎదుగుదల పొంది ఉన్నత ప్రమాణాలతో పరీక్షలో విజయాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. త్వరలోనే 'విజయకేతనం' పుస్తకం ద్వారా తక్కువ ప్రామాణికం ఉన్న విద్యార్థులను అభివృద్ధి చేసి ఉన్నత ప్రమాణాలతో ఉత్తీర్ణత శాతాన్ని పెంచి జిల్లాను మొదటి స్థానంలో ఉంచుతామన్నారు.

ప్రభుత్వ మాటలన్నీ.. నీటి మూటలే..!

తడిచిన ధాన్యంపై అబద్ధపు మాటలు

ఒక్క గింజా కొనుగోలు చేయని దుస్థితి

ఆత్మహత్యే శరణ్యం అంటున్న రైతులు

అధికారిక ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటనలన్నీ కంటితుడుపు చర్యలే

12 ఎకరాలు సాగు దాటితే ధాన్యం కొనుగోలు చేయరట

అన్నదాతతో ప్రభుత్వం ఆటలా అంటూ సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నాపేరు నున్న నాగ దుర్గారావు, దెందులూరు మండలం పోతునూరు గ్రామం. తొమ్మిదెకరాల్లో పంటకు సంబంధించిన ధాన్యం మొత్తం తుపానుకు కళ్లంలోనే తడిసిపోయింది. అధికారులు వచ్చి పరిశీలించారు. ధాన్యం పైకి చేరవేయాలని, వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. పెద్దఎత్తున ఖర్చు పెట్టి ధాన్యం రోడ్డుపైకి తెచ్చాను. ధాన్యం కొనకపోగా, ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. కౌలుకు తీసుకుని పెద్దఎత్తున పెట్టుబడి పెట్టాను. తుపానుతో మళ్లీ అదనపు ఖర్చులయ్యాయి. ధాన్యం కొనుగోలు చేయకపోతే మా కుటుంబానికి ఆత్మహత్యనే శరణ్యం. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను నమ్మించి మోసం చేయడం ఎంతవరకూ న్యాయమో ప్రభుత్వమే చెప్పాలి.'

'ఉంగుటూరు మండలం తల్లాపురం గ్రామం మాది. నా పేరు కేతా రామారావు. నాలుగెకరాలు సాగు చేశాను. మాసూలు చేసిన ధాన్యం కళ్లంలో ఉండగా తుపాను విరుచుకుపడింది. పొలాల్లో నడుం లోతు నీరు చేరింది. రాశులన్నీ తడిసిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరిశీలించారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తామని చెప్పారు. అష్టకష్టాలు పడి ధాన్యం గట్టుమీదకు తెచ్చినా కొనే పరిస్థితి లేకుండాపోయింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతూ ఎందుకు కొనడం లేదో అర్థం కావడం లేదు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

పైన పేర్కొన్న రైతులు దుర్గారావు, రామారావులే కాదు.. జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని సిఎం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదంటూ గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ వట్టిబూటకంగా మారాయి. జిల్లాలో ఎక్కడా తడిసిన ధాన్యం ఒక్క గింజ కొనుగోలు చేయని పరిస్థితి కొనసాగుతోంది.

ఉంగుటూరు మండలం తల్లాపురంలో తడిసిన ధాన్యంను గట్టుకు చేరుస్తున్న రైతులు

మొలకలొచ్చిన ధాన్యం

ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలన్నీ కంటితుడుపు చర్యలుగా మారాయి. నీటిలో నానిన ధాన్యం గట్టుకు చేర్చినా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా 1,93,398 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటి వరకూ 89,542 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. మాసూళ్లు పూర్తయినప్పటికీ వేల టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. మిచౌంగ్ తుపాను దెబ్బకు పొలాల్లో మోకాళ్ల లోతుకుపైగా

తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

నిలిచిపోయాయి. పల్లపు పొలాల్లో అయితే నడుం లోతు నీరు నిలబడిపోయింది. దీంతో ధాన్యపు రాశులన్నీ నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో పైకి చేరవేసేందుకు సైతం అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దఎత్తున అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. తీరా ధాన్యంపైకి చేరవేస్తే కొనే పరిస్థితి లేకుండా పోయింది. తడిసిన ధాన్యం ఆరబెట్టడం రైతులకు కత్తిమీద సాములా మారింది. నీటిలో నానడంతో ధాన్యం మొలకలు వచ్చేస్తోంది. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.

క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతోంది. అధికారులు పర్యటించి వచ్చిన ప్రాంతాల్లో కూడా ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. తడిసిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. 17 శాతం దాటితే తర్వాత ఒక్క శాతానికి బస్తాకు కిలో ధాన్యం తగ్గిస్తూ మిల్లర్లు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తేనే రైతులకు ఎంతోకొంత మేలు జరుగుతోంది. లేకపోతే ఎటువంటి ప్రయోజనమూ ఉండదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

12 ఎకరాలు దాటితే ధాన్యం కొనరట

రైతులు 12 ఎకరాలకు మించి వరి సాగుచేస్తే మిగిలిన ధాన్యం కొనుగోలు చేసేందుకు నిబంధనలు అనుకూలంగా లేవంటూ రైతులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో 12 ఎకరాలు పైన సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉంగుటూరు మండలంలో ఈవిధంగా పలువురు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా నిలుపుదల చేశారు. దీంతో తమ ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందించారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే నిర్ణయం తీసుకోకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడనుంది.

ఎన్యుమరేషన్ చేసేదెప్పుడో..!

దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం అంచనాలు ఎప్పుడు చేస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. నీరు తగ్గిపోయి, పంట ఒబ్బిడి చేశాక వస్తే ఏం ఉపయోగం ఉంటుందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం తెలియాలంటే వెంటనే వస్తే కళ్లకు కట్టినట్లు కన్పిస్తోందని రైతులు చెబుతున్నారు. వెంటనే నష్టపరిహారం అంచనాలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన రైస్ మిల్లులకు ధాన్యం

త్వరితగతిన పంటనష్టం నమోదు చేయండి

బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలి

అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మొత్తం యుద్ధప్రాతిపదికన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. తుపాన్ అనంతరం చేపట్టాల్సిన చర్యలపై స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా అధికారులతో కలిసి మండల అధికారులు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో తూపాన్ అనంతరం చేపట్టాల్సిన పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. అధికారులు రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆఫ్ లైన్‌లో దగ్గరలోని రైస్ మిల్లులకు 24 గంటల్లోగా తరలించాలన్నారు. గోనెసంచులకు కొరత లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పంట నష్టాలపై సాధ్యమైనంత త్వరలో నివేదిక సమర్పించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, డ్రెయిన్లలో పూడిక తీయించాలని, రోడ్లపై

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చెత్త నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందేలా చూడాలన్నారు. ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రుల్లో పాము కాటు నివారణ మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలని, రహదారులు భవనాల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జెసి బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, రహదారులు, భవనాలు, ట్రాన్స్‌కో ఎస్ఇలు శ్రీనివాసరావు, కేదారేశ్వరరావు, సత్యనారాయణ, జాన్ మోషే, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.40వేలు పరిహారమివ్వాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, ధాన్యం రైతులకు ఎకరాకు రూ.40 వేలు, వాణిజ్య పంట రైతులకు ఎకరాకు రూ.60 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మిచౌంగ్ తుపాను కారణంగా ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో నీట మునిగిన పంటలను ఆయన సిపిఐ బృందంతో కలిసి పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సిఎం జగన్, రెవెన్యూ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తక్షణం గ్రామాలు తిరిగి నష్టపోయిన రైతాంగాన్ని కలిసి నష్టాల అంచనాను స్వయంగా నిర్ధారించాలని, తడిసిన ధాన్యాన్ని షరతుల్లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుపాను వస్తుందని పది రోజుల క్రితమే వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో సిపిఐ రైతు సంఘం నష్టపోయిన పంటలను పరిశీలించి తొమ్మిదో తేదీన విజయవాడలో అఖిలపక్ష పార్టీల సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని రామకృష్ణ తెలిపారు. పంట నష్టాలను పరిశీలించిన వారిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, డేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నష్టం తక్షణం నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మిచౌంగ్ తుపాను వల్ల పంటలు నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, కాటంపూడి, జాలిపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను ఎపి రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ముంపునకు గురైన పొలాల్లో నీరు తోడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో వినూత్న రీతిలో రైతులు నిరసన తెలిపారు. తమను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాను వల్ల వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాల నమోదుకు ప్రభుత్వం తగు ఆదేశాలివ్వాలని కోరారు. 33 శాతం పంట నష్టాలను నమోదు నిబంధన సవరించి ఎంత మేర నష్టం జరిగినా నమోదు చేయాలన్నారు. వరికి ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా వర్తింపచేయాలని కోరారు. నష్ట పరిహారం కౌలు రైతులకే అందించాలని డిమాండ్ చేశారు. తడిసిన రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి వాడవల్లి రామారావు, పైడిపాటి భాస్కరరావు, గుండుబోయిన రంగారావు, నెరుసు రాములు, బుగ్గల సుబ్రహ్మణ్యం, సరిపల్లి ఏసురత్నం, సుబ్బయ్య, హనుమంతు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం:తుపాన్ వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న, పొగాకు, పత్తి, వేరుశనగ, తదితర పంటలను ప్రభుత్వం పారదర్శకంగా అంచనావేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం అచ్చయ్యపాలెంలో దెబ్బతిన్న పంటలను సిపిఎం బృందం పరిశీలించింది. తుపాన్ వల్ల పంటలన్నీ దెబ్బతిన్నాయని, పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకునేలా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు ఉన్నారు.

వ్యాపారులపై డిపిఒ ఆగ్రహం

పెదపాడు:పారిశుధ్య నిర్వహణలో వ్యాపారుల తీరుపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస విశ్వనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మిచౌంగ్ తుపానుకు గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడకూడదని జిల్లావ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన ఆదేశాలు జారీచేశారు. దానిలో భాగంగా సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో గురువారం మండలంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. తాగునీటి ట్యాంకులను, మురుగు కాల్వలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పంచాయతీ సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. తనిఖీల్లో భాగంగా సిబ్బందిని ఉరుకులుపరుగులు పెట్టించారు. ఈ క్రమంలో పెదపాడు, కొత్తూరు గ్రామాల్లో దుకాణాలను, అంగళ్లను తనిఖీ చేసిన డిపిఒ వ్యాపారుల బాధ్యతారాహిత్యంపై అసహనం వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, హోటళ్లు, మాంసాహార విక్రయ కేంద్రాలు, తినుబండారాలు, కూల్ డ్రింక్స్ షాపులు ఇలా అనేక దుకాణాలను తనిఖీచేసి బిత్తరపోయారు. దుకాణాల వద్ద కనీసం చెత్త కుండీలు లేకపోవడాన్ని గమనించి వ్యాపారస్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగళ్ల దగ్గర చెత్త పేరుకుపోవడం చూసి ఒకవైపు పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పరిసరాలు శుభ్రం చేస్తుంటే లాభాలు ఆశించే వ్యాపారస్తులు ప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టరా అని ప్రశ్నించారు. కొన్ని టీ షాపులు దగ్గర తాగి పారేసిన టీ గ్లాసులు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే ప్రజలకు వ్యాధులు రావా అని అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నారని, పైగా దుకాణాదారులు వారిపరిధిలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు డిపిఒ దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ సిబ్బంది తనిఖీలు ఎందుకు చేయడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాలు ఆశించి వ్యాపారాలు చేసుకోవడం తప్పులేదని, తమపరిధిలో పారిశుధ్య నిర్వహణ లేకుండా స్థానిక ప్రజలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. స్వయంగా వ్యాపారస్తులతో శ్రమదానం చేయించి వ్యాపార కేంద్రాలవద్ద శుభ్రం చేయించారు.

అర్హులకు ఓటు హక్కు తప్పనిసరి

జీలుగుమిల్లి:18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎ.రాము సూచించారు. మండల కేంద్రం జీలుగుమిల్లిలో గురువారం నిర్వహించిన 'నీ ఓటు నీ భవిష్యత్' అవగాహన ర్యాలీలో రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు సంబంధించి బిఎల్‌ఒలకు పలు సూచనలు చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఓటర్ల జాబితా తప్పులు లేకుండా పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందరసింగ్, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, ఎపిఒ జాన్ వెస్లీ, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్ పాల్గొన్నారు.

'ఉన్నతి - మహిళా శక్తి'తో సాధికారత

సున్నా వడ్డీకే రుణాలు

ఆటో రిక్షాల కొనుగోలుకు ప్రోత్సాహం...

11 మంది డ్వాక్రా మహిళలకు ఆటోలు

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఉన్నతి-మహిళాశక్తి' ప్రత్యేక పథకం ద్వారా వారి జీవనోపాధికి సున్నా వడ్డీకే ఆటో రిక్షాలు అందిస్తోందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఈ పథకాన్ని ప్రారంభించి 11 మంది ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ఆటోలను కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆటోలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి ప్రయాణించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి మహిళల జీవనోపాధికి సిఎం జగన్ ఉన్నతి-మహిళాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మహిళల జీవనోపాధికి ఇదిఎంతో దోహదపడుతుందన్నారు. లబ్ధిదారులపై భారంలేకుండా సులభవాయిదాల్లో రుణాలు చెల్లించుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆటో కొనుగోలు సమయంలో లబ్ధిదారులు పది శాతం వాటా ధనాన్ని ఎస్‌హెచ్‌జి బ్యాంకు ఖాతాలో జమచేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణంగా అందిస్తామన్నారు. ఏలూరు జిల్లాలో 12 మంది ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు రూ.37.97 లక్షల విలువైన ఉన్నతి - మహిళాశక్తి పథకం ఆటోలను మంజూరు చేయగా వాటిలో గురువారం 11 మంది మహిళలకు అందజేశామన్నారు. ఇందుకోసం రూ.36 లక్షల వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించామన్నారు. ఆటోలు తీసుకొనే మహిళలకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని, వీరికి డిఆర్‌డిఎ, రవాణాశాఖ అధికారుల ద్వారా అవసరమైన సహకారం అందజేస్తామన్నారు. కేవలం ఈ 11 మంది మహిళలతోనే ఈ పథకం ఆగకుండా మరింతమంది ఎస్‌హెచ్‌జి మహిళలు ముందుకు రావాలన్నారు. కాలుష్య నియంత్రణను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోలు కాకుండా సిఎన్‌జి ఆటోలను ప్రోత్సహిస్తామన్నారు. జెసి మాట్లాడుతూ సెర్ప్ ఉన్నతి విభాగం ద్వారా మహిళల జీవనోపాధి కల్పించేందుకు మహిళా శక్తి ఆటో

ఆటోను ప్రారంభించి, అందులో ప్రయాణిస్తున్న కలెక్టర్, జెసి

పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రస్తుతం 12 ఆటో రిక్షాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన మహిళలు స్వయం సహాయ సంఘాల సభ్యులై ఉండి, వయస్సు 20 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు మాత్రమే అర్హులన్నారు. 10 శాతం లబ్ధిదారుల వాటాగా, మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, ఆర్‌టిఒ శ్రీహరి, బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కుముదినీసింగ్, మహిళా శక్తి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకుంటాం

బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తుపాన్‌కు పొగాకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ తెలిపారు. మండలంలోని ములగలంపల్లి, రౌతుగూడెం, పాములవారిగూడెంలో దెబ్బతిన్న పొగాకు పంటలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలో 350 ఎకరాలకుపైగా పంట దెబ్బతినిందన్నారు. ఈ పంటలను పరిశీలించినట్లు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసి పూర్తిస్థాయి నివేదికలు అందించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేలా చూస్తామని తెలిపారు. బోర్డు అధికారుల సూచనల మేరకు వర్షానికి నీట మునిగిన పంటను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఆర్‌ఎం ఆదిశేషయ్య, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల నిర్వహణాధికారులు బి.శ్రీహరి, సురేంద్రకుమార్, కరాటం రెడ్డిబాబు, రాంబాబు, గాంధీ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం:మిచౌంగ్ తుపాన్‌కు నీటమునిగిన పొగాకు పంటల రక్షణకు సిటిఆర్‌ఐ సలహాలు పాటించాలని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం పొగాకు బోర్డు ఛైర్మన్ జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని మైసన్నగూడెం, వేగవరం, చల్లవారిగూడెం, ములగలంపల్లి ప్రాంతాల్లో పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పొగాకు పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ తరుణంలో రైతులు మరింత నష్టపోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బోర్డు అధికారులు సిటిఆర్‌ఐ శాస్త్రవేత్తల సూచనల మేరకు పొగాకు తోటల్లో వర్షపు నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర, పొగాకు రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డిబాబు, రైతులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : తుపాను ధాటికి నష్టపోయిన పొగాకు రైతులకు బోర్డు అన్నివిధాలా అండగా ఉంటుందని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ భరోసా ఇచ్చారు. తుపానుకు దెబ్బతిన్న పొగాకు పంటలను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ మండలంలోని 4441 హెక్టార్లలో పొగాకు సాగుచేశారని, అందులో దాదాపు 40 శాతం పంటకు నష్టం వాటిల్లిందన్నారు. సిటిఆర్‌ఐ శాస్త్రవేత్తలు, బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు నష్ట నివారణ చర్యలకు తగు సూచనలు సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి గ్రేస్ మార్గరేట్, పొగాకు బోర్డు అధ్యక్షులు కాకర్ల వివేకానంద, రైతులు, బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నిక నిర్వహణలో సెక్టార్ అధికారులే కీలకం

తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదు

సెక్టార్ ఆఫీసర్లు, పోలీస్ అధికారుల శిక్షణలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలకపాత్ర అని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జెసి బి.లావణ్యవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందస్తుగా 206 మంది సెక్టార్ అధికారులను, మరో 206 మంది పోలీస్ సెక్టార్ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలున్నాయన్నారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని ఏదశలోను ఎలాంటి తప్పిదాలకూ ఆస్కారం ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో పోలింగ్‌కు వారంరోజుల ముందు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు ఇస్తామన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలన్నారు. సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. గ్రామాల్లో ఆయా సామాజిక తరగతులతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. సమావేశం అనంతరం అక్కడ వచ్చిన అంశాలకు సంబంధించిన నివేదికను అందజేయాలన్నారు. సెక్టార్ ఆఫీసరు పరిధిలో పోలింగ్ స్టేషన్‌లో గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలకు సంబంధించి పూర్వాపరాలను తెలుసుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు తమ నివేదిక ఇచ్చే ముందు అన్ని కోణాల్లో పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో గత రెండు సాధారణ ఎన్నికల్లో ఓటరు టర్నవుట్, ఎంసిసి ఉల్లంఘన కేసులు, ఒలనరేబిలిటీ, మ్యాపింగ్, రూట్ మ్యాప్‌లు పరిశీలించాలన్నారు. అదే విధంగా గత ఎన్నికల్లో రీపోల్ జరిగిన సంఘటనలు ఏమైనా ఉన్నాయా? మత్తు పదార్థాల సరఫరా, ఎన్నికల వ్యయానికి సంబంధించిన అంశాలను కూడా గుర్తించాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల సంఖ్య ఏ నియోజకవర్గం, ప్రస్తుత సమస్యలు, సెక్టార్ మ్యాప్ పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికలకు ప్రధానంగా ఎలక్ట్రోరల్, ఇవిఎం, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది కీలకమన్నారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పరిశీలన జరుగుతుందని, తుది ఓటర్ల జాబితా 2024 జనవరి ఐదో తేదీన ప్రకటిస్తామన్నారు. ఇవిఎంల మొదటి లెవిల్ చెకింగ్ కూడా పూర్తయిందన్నారు.

లోపూడిలో పల్లెకు - పోదాం కార్యక్రమం

'ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పాటు'

ప్రజాశక్తి - ముసునూరు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు ఇస్తున్నారని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని లోపూడి గ్రామంలో ఎంపిపి కొండా దుర్గభవాని, ఎంపిడిఒ జి.రాణిల ఆధ్వర్యంలో పల్లెకు-పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బోర్డులను ఆవిష్కరించి, గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా.. లేదా.. అని అడిగారు. మరలా జగనే అధికారంలోకి రావాలంటూ గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పేరం కృష్ణ, వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు బి.నరిసింహారావు, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ముప్వ స్రవంతి, విఆర్‌ఒ నవీన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి: చాట్రాయి మండల ఉద్యానశాఖాధికారి ఆర్.హేమ గురువారం మిర్చి తోటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మిర్చి, మామిడికి తెగుళ్లు రాకుండా బైటాక్స్ మూడు మిల్లీగ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, పడిపోయిన మొక్కలను నిలబెట్టి వేరు మొదల్లో మట్టితో గట్టిగా నిలబెట్టాలని అన్నారు. పైరు బలానికి మూడు 19 పిచికారీ చేయాలని తెలిపారు. మామిడిలో కుళ్లు తెగులు, పక్షి కన్ను తెగులు రాకుండా సాఫ్ రెండు మిల్లీగ్రాములకు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. అకాల వర్షాలు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

కొయ్యలగూడెం : తుపాన్ కారణంగా పంట నష్టపోయిన పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో మంగపతి దేవి పేట గ్రామంలో సిపిఐ నాయకులతో కలిసి ఆయన తుపాన్ ప్రభావితంతో దెబ్బతిన్న పొగాకు తోటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ వలన పొగాకు పంటలు పూర్తిగా పాడైపోయాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి తుపాన్ కారణంగా దెబ్బతిన్న, పంట నష్టపోయిన రైతులను ఆదుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. ఈయన వెంట గుదే శ్రీను, శేషారావు ఉన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

జీలుగుమిల్లి : తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు. గురువారం మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లిలో దెబ్బతిన్న పొగాకు, వేరుశెనగ, వరి పంటలను ఆయన క్షేత్ర స్థాయిలో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికొచ్చిన పంటలు దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పారేపల్లి రామారావు, పార్టీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, ఎంపిటిసి నాలి శ్రీను, తమ్మన సాంబ, గుడపాటి పుల్లయ్య, రాజాబాబు, కృష్ణ, కిరణ్ చౌదరి, అఖిల్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం మండలంలో కన్నాపురం, దిప్పకాయలపాడు గ్రామాలలో పార్టీ నాయకులతో కలిసి వరి, పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణారావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ పంటలను సాగు చేసుకుంటున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : తుపాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.35 వేల పరిహారం చెల్లించాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు ప్రాంతాల్లో ముంపుకు గురైన వరి పంట పొలాలను సందర్శించిన ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి శ్రీనివాసరావు, హీరా హకీమ్, పిండి రాము పాల్గొన్నారు.

ముసునూరు : తుపాన్ నష్టపరిహారం నమోదులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ రైతులను మరింత వేదనకు గురి చేస్తుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ముసునూరు మండలం, కాట్రేనిపాడు, వలసపల్లి తదితర గ్రామాల్లో తుపాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గద్దల మోహనరావు, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, మెదరమెట్ల సురేంద్ర, గారపాటి నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

చింతలపూడి : తుపాన్ కారణంగా మండలంలో కొంతమేర నష్టం జరిగినప్పటికీ అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణహాని జరగలేదని చింతలపూడి మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రగఢవరం, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో రెండు గృహాలు మాత్రం పాక్షికంగా దెబ్బతిన్నాయని, విద్యుత్‌కు సంబంధించి ఏడు స్తంభాలు పడిపోగా వాటిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించటం జరిగిందని అన్నారు. తడిసిన ధాన్యం 852 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఏ రైతు నష్టపోకుండా కలెక్టర్ సూచనల మేరకు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1,424 ఎకరాల్లో ధాన్యం తడిసిందని, ఈ 1,424 ఎకరాల్లో తడిసిన ధాన్యాన్ని 1,153 ఎకరాల్లో ఇబ్బంది లేకుండా నీరు బయటకు పంపించడం జరిగిందని తెలిపారు. మొక్కజొన్న 145.5 ఎకరాల్లో, వేరుశనగ 140 ఎకరాలు, పొగాకు 20 ఎకరాల్లో దెబ్బతిందని, ఏ రైతుకు నష్టం జరగకుండా ప్రభుత్వంతో చర్చలు జరిపి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రహదారికి మరమ్మతులు

ముదినేపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చేవూరు గ్రామంలో రహదారి పూర్తిగా పాడై ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి కృంగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. గురువారం చేవూరు గ్రామ సర్పంచి వల్లభనేని లక్ష్మీ వెంకట్రావు జెసిబితో గుంతలను పూర్తి రోడ్డు చదును చేయించారు.

నేరాలు - ఘోరాలు

మనస్తాపంతో కౌలు రైతు మృతి



మండవల్లి: ఆరు కాలాలు శ్రమించి పండించిన పంట తుపాన్ ప్రభావంతో నీట మునిగిందని మనస్తాపంతో కౌలు రైతు మృతి చెందిన సంఘటన పెరికెగూడెంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం పెరికెగూడెం గ్రామానికి చెందిన బోయిన జయరాజు(44) సుమారు రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను పండించాడు. అయితే తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పంట పూర్తిగా నీట మునిగింది. దీంతో మనస్తాపానికి గురై పొలం గట్టు మీదే పడిపోయి ఉండడాన్ని గమనించిన తోటి రైతులు హుటాహుటిన జయరాజును ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే జయరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జయరాజ్ పొలం వద్ద చనిపోవడంతో అన్నా రైతు కుటుంబసభ్యులు బంధువులు తెలిపారు. జయరాజ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మొలకెత్తిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలి

పాలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగం

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం కొనుగోలులో సడలించిన నిబంధనలకు అదనంగా మొలక వచ్చిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని పాలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. తుపాను తగ్గిన నేపథ్యంలో గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన నష్టాలను పరిశీలించేందుకు తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు సర్పంచి గురువారం ఉదయం గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మమేకమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వానల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులతో మాట్లాడారు. రవాణాకు సిద్ధం చేసి కళ్లాలలో నిలువ ఉంచిన ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు వాటిని ఆరబెట్టేందుకు రోడ్లపై తెచ్చారు. మాజీ ఎంపిటిసి కోట శంకరం, కోట బంగారయ్య, ఇతరులు రైతులు పడుతున్న ఇబ్బందులను సర్పంచి దృష్టికి తెచ్చారు. సడలించిన నిబంధన మేరకు తేమశాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ధాన్యాన్ని సేకరించేందుకు ప్రభుత్వం అనుమతించిందని వారు

ధాన్యాన్ని పరిశీలిస్తున్న పాలసానిపల్లి సర్పంచి

తెలిపారు. ఈ నేపథ్యంలో తేమశాతం తగ్గించేందుకు రోడ్లపై ఆరబెడుతున్నామని తెలిపారు. గ్రామ పరిధిలో ఇంతవరకు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉత్పత్తి జరిగిన మూడువేల టన్నుల ధాన్యం తరలింపు సమస్యను సర్పంచి తెలియజేశారు. ఇదే క్రమంలో కళ్లాలలో నిలువ ఉంచిన ధాన్యపు రాసుల కింద భాగం లోనికి చెమ్మ చేరిన నేపథ్యంలో ధాన్యం మొలక వచ్చిందని సర్పంచి తెలిపారు. దీనిపై స్పందించిన సర్పంచి సదరు ధాన్యం తరలింపు విషయమై సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇదేవిధంగా తుపాను కారణంగా బీసీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో 10, 11, 12వ వార్డులలో తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ఉపసర్పంచి కోట శ్రీనివాసరావుతో పాటు వైసిపి ప్రముఖులు బి.పెద్దిరాజు, ఎస్.రాజు, ఎం.రాజేష్, అప్పారావు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇదేవిధంగా తుపాను కారణంగా చెట్లు విద్యుత్ లైన్లపై ఒరగడం, కొన్నిచోట్ల తెగిన పెద్ద కొమ్మలు లైన్లపై పడడం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. ఈ సమస్య పరిష్కారంలో భాగంగా లైన్ల మరమ్మతులకు వాటిని తొలగించామని తెలిపారు. జగనన్న కాలనీకి అనుసంధానంగా ఉన్న రోడ్డు ముంపుకు గురై, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో వరద నీటిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు సర్పంచి తెలియజేశారు.

రైతులెవ్వరూ అధైర్య పడొద్దు

పంట నష్టం అంచనాల్లో అధికారులు

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం మిచౌంగ్ తూపాన్ ప్రభావితం వల్ల నష్టపోయిన రైతుల నుంచి తడిచిన, రంగుమారిన, మొలకెత్తిన కూడా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి, ప్రతి ఒక్క రైతుకి అండగా ఉండాలని అధికారులను ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ఆదేశించారు. గురువారం ఎంఎల్‌ఎ, ఐటిడిఎ పిఒ సూర్యతేజతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. నేలకొరిగిన పంటలను పరిశీలించి, రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తహశీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు

టి.నరసాపురం : తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడొద్దు, ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు(సూరిబాబు) అన్నారు. మండలంలో గురువారం అధికారులతో కలిసి మించౌంగ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కళ్లాలలో తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని, తుపాన్ ప్రభావం తగ్గింది కాబట్టి అధికారులు పంట నష్టాలపై ఎన్యుమరేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వారిలో మండల కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, మండల వ్యవసాయశాఖ అధికారి డి.ముత్యాలరావు ఉన్నారు.

ఆగిరిపల్లి : పంట నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు ఆధైర్యపడవద్దని, నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని బొద్దనపల్లి, ఈదర గ్రామాల్లో తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది

ఆగిరిపల్లి : దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ ప్రతాప్

క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతులకు తగు సూచనలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి.చెన్నారావు, హెచ్‌ఒ.జ్యోతి ప్రియాంక, జెడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవపూడి గ్రామంలో కల్లంలో తడిసిన, రంగు మారిన, తడిసి మొలకెత్తిన, నీట మునిగిన పంటను వైసిపి నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామంలో 430 ఎకరాల్లో పంట పూర్తిగా నీట మునిగిందని, ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా'

భీమడోలు : యువతను వివిధ అంశాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.పద్మావతి దేవి కోరారు. ఈమేరకు గ్రామ సచివాలయాలు, గ్రామ పంచాయతీల స్థాయిల్లో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్-2023కు అవసరమైన క్రీడా సామాగ్రిని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం బాధ్యులకు అందజేశారు. మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల సిబ్బంది వీటిని అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. దీనిలో భాగంగా ఐదు క్రీడా విభాగాల్లో స్త్రీ, పురుషులకు వేరువేరుగా ఆటల పోటీలను నిర్వహిస్తారన్నారు. ఇదేక్రమంలో పంచాయతీ స్థాయిలో ఈనెల 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో ఈనెల 21 నుంచి జనవరి మూడో తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

భీమడోలు : ట్రాన్స్ కో భీమడోలు ఎడిఎ కార్యాలయ పరిధిలో తుపాను సందర్భంగా ఏర్పడిన ఇబ్బందుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నట్లు ఎడి ఎ.గోపాలకృష్ణ తెలిపారు. తుపాను సందర్భంగా వివిధ గ్రామాల్లో 50 వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయన్నారు. కిలోమీటర్ల పొడవున విద్యుత్ కండక్టర్లను తిరిగి వేయవలసిన పరిస్థితి నెలకొందన్నారు. వీటికి అదనంగా 10 వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడవ్వగా దీనిలో భీమడోలుకు చెందినవి నాలుగు వరకు ఉన్నాయన్నారు. కొల్లేరు సరస్సు నుంచి వరదనీరు వెనక్కు వస్తున్న నేపథ్యంలో సాయంపాలెంలో ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించామని తహశీల్దార్ తెలిపారు.

ఏలూరు : మిచౌంగ్ తుపాను నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో తుపాను ఉద్రిక్తతకు విద్యుత్ శాఖలో 33/11 కె.వి.విద్యుత్ ఉపకేంద్రాలు-23, 33 కె.వి.ఫీడర్లు-14, 11 కె.వి.ఫీడర్లు-82, 33 కె.వి.విద్యుత్ స్తంభాలు-13, 11 కె.వి.విద్యుత్ స్తంభాలు-625, ఎల్.టి.విద్యుత్ స్తంభాలు-304, విద్యుత్ పరివర్తకాలు-201 దెబ్బతిన్నాయని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ పి.సాల్మన్ రాజు తెలిపారు. విద్యుత్ శాఖలో తుపాను వల్ల దెబ్బతిన్న వాటిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించటం జరిగిందన్నారు. ఇంకా ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1912కి గాని, ఏలూరు సర్కిల్ ఆఫీస్‌లోని ప్రత్యేక కంట్రోల్ రూమ్ నెంబరు 9440902926 గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఆగిన వరద

చింతలపూడి : మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్దనున్న తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి గురువారం సాయంత్రం సమాచారం ప్రకారం ఎగువ నుంచి వస్తున్న వరద ఆగిపోయినట్లు ఎఇఇ.పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం తమ్మిలేరు బేసిన్ 344.73 అడుగులు, గొనెల వాగు బేసిన్ 342.14 అడుగులు గాను వుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.354 టిఎంసిలుగా వుందని పరమానందం తెలిపారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి

జీలుగుమిల్లి : జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ప్రాంతీయ అధికారి రాకేష్ కుమార్ తెలిపారు. గురువారం అంతర్ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్దనున్న 516డి జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి తల్లాడ దేవరపల్లి రహదారిను పరిశీలించినట్లు తెలిపారు. ఈ రహదారి పనులను కొన్ని రోజుల క్రితం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ సంజీవ రాయుడు, జెఇ ఖాజా, డిఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గడపగడపకూ' అర్జీలకు సత్వర పరిష్కారం : నాని

ఏలూరు టౌన్ : గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. ఏడో డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఏదేని సమస్యలతో పథకాలు అందని వారికి సంబంధిత ఇబ్బందులను తొలగించి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో రూ.50 లక్షల విలువైన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

భీమడోలు : వర్షాలు తగ్గిన నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న, వరద నీటి మునిగిన వరి పైరు రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు డాట్ సెంటర్‌కు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు కోరారు. తుపాను నేపథ్యంలో వరి పొలాలను పరిశీలించేందుకు డాట్ సెంటర్‌లోని వివిధ విభాగాలకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.ఫణికుమార్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ ఎన్.చాముండేశ్వరి మండలంలో గురువారం పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పైరుతో పాటు, వానలకు నీట మునిగిన పనలను పరిశీలించారు. నీట మునిగిన పనలకు, మొలకలు రాకుండా చూసేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

చేబ్రోలు ఎస్ఐగా మణికుమార్

ఉంగుటూరు : చేబ్రోలు పోలీసు స్టేషన్ ఎస్ఐగా ఎ.మణికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకూ ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన కాశి స్వామి బదిలీ అవ్వడంతో ఏలూరు విఆర్ నుంచి మణికుమార్ చేబ్రోలు ఎస్ఐగా వచ్చారు. గతంలో ఈయన ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి పోలీసు స్టేషన్‌లో పనిచేశారు.

మైనర్లు మోటార్ సైకిల్ నడిపితే చర్యలు

ఏలూరు స్పోర్ట్స్ : కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే మైనర్ విద్యార్థులు మోటారు సైకిళ్లను వినియోగిస్తే చర్యలు తప్పవని ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు తెలిపారు. డిఎస్‌పి కార్యాలయంలో నగరంలోని పలు కళాశాలల యాజమాన్యాలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మైనర్ బాలలు, లైసెన్సులు లేని విద్యార్థులు కళాశాలలకు మోటారు సైకిల్‌పై రాకూడదని, వారిని నిలువరించే బాధ్యత కళాశాలల యాజమాన్యం తీసుకోవాలని సూచించారు.

త్రీటౌన్ ఎస్ఐగా షేక్ మదీనా బాష

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మూడో పట్టణ ఎస్ఐగా షేక్ మదీనా బాష గురువారం ఏలూరు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పెనుమంట్ర ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీ అయ్యారు. గతంలో ఆయన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

చింతలపూడి: ఈనెల 9న చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు రాజీ చేసుకోవచ్చని, కక్షిదారుల విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని, సివిల్ కేసులలో కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని చింతలపూడి కోర్టు పరిధిలో వున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చింతలపూడి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. పట్టణంలో ఎంపిడిఒ మురళీకృష్ణతో కలిసి ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తప్పక ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

పోలవరం : తుపాన్ ప్రభావం తగ్గడంతో గూటాల కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధులలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పంచాయతీ సెక్రటరీ తాతి విజయ కుమారి తెలిపారు. గురువారం వాటర్ ట్యాంకులు క్లీనింగ్ చేయడం, డ్రెయినేజీలు శుభ్రం చేయడం వంటి పనులు చేపట్టినట్లు సెక్రటరీ తెలిపారు. ప్రజలు దోమతెరలు ఉపయోగించుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

నివేదిక సమగ్రంగా ఉండాలి

జీలుగుమిల్లి : మిచౌంగ్ తుపాన్ నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఎ.రాము అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. 1067 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడన్నారు. రెండు పెంకుటిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నారాయణపురం గ్రామ కాపురస్తులైన అక్కిన లక్ష్మీనారాయణ, తండ్రి: వీరాస్వామి వియ్యపురాలైన విజయవాడకు చెందిన పుట్టగుంట రామతులసి అలియాస్ గంటా రామతులసి, భర్త: శివరామ్ ప్రసాద్ అను నాకు గల 4211/2013 నంబరు కలిగిన పొలం దస్తావేజులు 4-12-2023వ తేదీన మా వియ్యంకుడైన అక్కిన లక్ష్మీనారాయణకు ఇవ్వగా నారాయణపురం నుంచి తాడేపల్లిగూడెం వెళు తుండగా దస్తావేజులు కలిగిన కవర్ మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈక్రింద అడ్రసుకు తెలియజేయగలరు.

అక్కిన లక్ష్మీనారాయణ
సాయిబాబా ఆలయం వద్ద, నారాయణపురం
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
పిన్: 534406, సెల్: 9542223761

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నారాయణపురం గ్రామ కాపురస్తులైన అక్కిన లక్ష్మీనారాయణ, తండ్రి: వీరాస్వామి అను నాకు గల 7355/2016 నంబరు కలిగిన పొలం దస్తావేజులు 4-12-2023వ తేదీన నారాయణపురం నుంచి తాడేపల్లిగూడెం వెళు తుండగా దస్తావేజులు కలిగిన కవర్ మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈక్రింద అడ్రసుకు తెలియజేయగలరు.

అక్కిన లక్ష్మీనారాయణ
సాయిబాబా ఆలయం వద్ద, నారాయణపురం
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
పిన్: 534406, సెల్: 9542223761

ప్రకటన
మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 704/2022

Between:
వాది:
మేడపాటి శ్రీరామకృష్ణారెడ్డి తరుపు GPA హోల్డర్ అయిన మేడపాటి నాగ సంతోషి
మరియు
ప్రతివాదులు: మేడపాటి శ్రీహరి గోపాలరెడ్డి వగైరా
2వ ప్రతివాది: గుడిమెట్ల శ్రీ గోపాలకృష్ణారెడ్డి, S/o. లక్ష్మణరెడ్డి, డో.నెం. 4-57/2, కంతేరు, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534126.

పై నెంబరు దావా గ్రంథమునందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు దావాలో సమన్లు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా సమన్లు అమలు నిమిత్తము ది. 29-12-2023 సం॥రం తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయము గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చు కోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order//
డి.సుబ్రహ్మణ్యం
దేవ వీర వెంకట సత్యనారాయణమూర్తి
వాది తరపు న్యాయవాదులు
ది.04-12-23 తణుకు, సెల్: 9701310996

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు
ఆర్.ఓ.సి. నెం. 78/2021/ఇ1 తేది.07-12-2023
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో ఆర్.సి.సి. కల్వర్టు, వీధి దీపముల రిపేర్లు మరియు నిర్వహణ కొరకు అవసరమగు ఎలక్ట్రిషియన్స్‌ను చేయు నిమిత్తం (2 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 6,64,500/-లతో మరియు GGMP నిధులతో సి.సి. రోడ్లు, సి.సి. డ్రెన్స్ మరియు కల్వర్ట్స్ నిర్మాణం నిమిత్తం (3 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 5,60,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 08-12-2023 తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- **బి.ఆర్.యస్.శేషాద్రి**
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, BHIMADOLU
OS.NO.119/2020

Between:
Smt. Nekkanti Mani Raja Kumari ...**PLAINTIFF**
Vs
1. Bobba Purnachandrarao
2. Bobba Srinivasa Rao ...**DEFENDANTS**

NOTICE

2nd Defendant:
Bobba Srinivasa Rao, Son of Purnachandra Rao, Cultivation, Lingapalem, Chintalapudi Mandal, W.G.Dt.

WHEREAS the plaintiff filed the suit for partition of the suit schedule property. The Honnourable court order notice to the 2nd defendant in the above suit.

Whereas the notice addressed to the 2nd defendant in the above suit could not be served as last known address and the summons could not be served:

Whereas the Honourable court ordered notice of the 2nd Defendant by way substituted service by way of publication;

You, are hereby called upon to appear in person or through Advocate before this Honurable court on **19-12-2023 at 10-30 AM** and state your objections if any. Lest suit will be decided ex-parte.

Bhimadole, **D.KRISHNA SASTRY**
Dt. 27-11-2023 Advocates for plaintiff

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, BHIMADOLU
I.A.NO.347/2020, OS.NO.119/2020

Between:
Smt. Nekkanti Mani Raja Kumari ...**PETITIONER/PLAINTIFF**
Vs
1. Bobba Purnachandrarao
2. Bobba Srinivasa Rao ...**RESPONDENTS/DEFENDANTS**

NOTICE

2nd RESPONDENT:
Bobba Srinivasa Rao, Son of Purnachandra Rao, Cultivation, Lingapalem, Chintalapudi Mandal, W.G.Dt.

WHEREAS the petitioner filed the above petition to grant ad-interim injunction restraining the respondents/defendants 1 & 2 from alienating the plaint schedule property in any manner during the pendency of the suit.

Whereas the notice addressed to the 2 nd respondent in the above suit could not be served as last known address and the notice could not be served: Whereas the Honourable court ordered notice of the 2nd respondent by way substituted service by way of publication;

You, are hereby called upon to appear in person or through Advocate before this Honurable court on **19-12-2023 at 10-30 AM** and state your objections if any. Lest the petition will be decided ex-parte.

Bhimadole, **D.KRISHNA SASTRY**
Dt. 27-11-2023 Advocates for plaintiff

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 1212/19 మరియు
ఐ.ఏ. నెం. 1213/19 ఇన్
ఏ.యస్. నెం. 13/2019

బిట్వీన్:
1. ముప్పిడి ఆశీర్వాదం (లేటు)
-పిటీషనర్/అప్పిలెంట్
2. ముప్పిడి జాన్‌వెస్లి, తండ్రి:(లేటు) ఆశీర్వాదం, వయస్సు 30 సం॥లు, డోరు నెం. 9-64, జగన్నాథపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా.
3. ముప్పిడి జార్జ్‌బాబు, తండ్రి: (లేటు) ఆశీర్వాదం, వయస్సు 43 సం॥లు, డోర్ నెం. 9-64, జగన్నాథపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా.
-పిటీషనర్స్ 2, 3/ప్రపోజిల్ 2, 3 అప్పిలెంట్స్
అండ్
1. ముప్పిడి పద్మ, భర్త: సుదర్శన్, వయస్సు 40 సం॥లు, గృహిణి, డోరు నెం. 2-105, కురెళ్ళగూడెం గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
2. ముప్పిడి సుజాత, భర్త: ఆకుల ఆనందరావు, వయస్సు 28 సం॥లు, కూలి, డోరు నెం. 2-13, పాతూరు, ఎస్‌సి కాలని, తాడేపల్లిగూడెం పట్టణం, ప॥గో॥జిల్లా.
3. ముప్పిడి సుధ, తండ్రి: సుదర్శన్, వయస్సు 27 సం॥లు, కూలి, యర్రమిల్లిపాడు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
4. ముప్పిడి సునీత, భర్త: నేకూరి రవి, వయస్సు 25 సం॥లు, కూలి, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
5. ముప్పిడి వెంకట సత్యనారాయణ, తండ్రి: సుదర్శన్, వయస్సు 24 సం॥లు, కూలి, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
6. ముప్పిడి రమేష్, తండ్రి: సుదర్శన్, వయస్సు 15 సం॥లు, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా (మైనర్ అయినందు వలన గార్డియన్ రిప్రజెంట్‌గా ఉన్నారు)
7. ముప్పిడి జకర్య, తండ్రి: సుదర్శనం, వయస్సు 15 సం॥లు, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా (మైనర్ అయినందు వలన గార్డియన్ రిప్రజెంట్‌గా ఉన్నారు)
8. ముప్పిడి చంటిబాబు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 55 సం॥లు, కూలి, డోరు నెం. 1-20, వల్లూరుపల్లి, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా.
9. ముప్పిడి శ్యామ్‌బాబు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 53 సం॥లు, కూలి, డోరు నెం. 7-45, చివటం గ్రామం, ఉండ్రాజవరం మండలం, ప॥గో॥జిల్లా.
10. ముప్పిడి సమూయేలు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 50 సం॥లు, కూలి, డోరు నెం. 10-25, లలితనగర్, తణుక, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.
11. ఉండ్రాజవరపు భాగ్యలక్ష్మి, భర్త: వెంకన్న, వయస్సు 48 సం॥లు, గృహిణి, డోరు నెం. 6-11/3, పాతూరు, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.
-రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్

పై నెంబరు గ్రంథములో రెస్పాండెంట్స్ 1 టు 7 గార్లు శ్రీ కోర్టు వారి ద్వారా మమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికి మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 22-12-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 గంటలు** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై పిటీషన్‌లు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్.కొండలరావు
పిటీషనర్/అప్పిలెంటు/ పిటీషనర్స్ 2, 3 /ప్రపోజిల్ 2 అండ్ 3 అప్పిలెంట్స్
తాడేపల్లిగూడెం
తేది:06-12-2023 తరపు న్యాయవాది